ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102


సంపుటి : 02 సంచిక : 72 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం 14 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02

# టీడీపీని వెంటాడుతున్న మావిగన్!
## - జగన్‌ను వెంటాడుతున్న టిడిపి..?



- ఒకవైపు వైసీపీ నేతలు మావిగన్ గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంటే, దానికి విరుగుడుగా అన్నట్టు జగన్ పై వ్యక్తిత్వ విమర్శల్ని తీవ్రం చేస్తున్న టిడిపి..!
- మావిగన్ ప్రతిపాదనపై చర్చకు టీడీపీ భయపడుతుందా..?
- మావిగన్ ప్రతిపాదన ఒక పిచ్చి చేష్టగా మొదట్లో ఆరోపించిన వాళ్లంతా, ఇప్పుడు దాని గురించి మాట్లాడ్డానికి వెనుకడుగు వేస్తున్నారా..?
- మావిగన్ ప్రతిపాదనలో 110 కిలోమీటర్ల రాజధాని కారిడార్ వుంది. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలున్నాయి. 60 లక్షల జనాభాకు సంబంధించిన ప్రయోజనాలు కనిపిస్తున్నాయా..?

ఏపీ. అమరావతి. కోస్టల్ జర్నలిస్ట్ ప్రత్యేక ప్రతినిధి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్లాన్ బీ అంటూ ప్రతిపాదించిన మావిగన్ టీడీపీని వెంటాడుతోంది. మొదట్లో మావిగన్ ఏంటంటూ అవహేళన చేశారు. అయితే అది హేళన కాదని, తమను రాజకీయంగా ఇరకాటంలో నెట్టేసే అస్త్రమని టీడీపీకి కాస్త ఆలస్యంగా తెలిసొచ్చింది. మావిగన్ పేరును మాత్రమే టీడీపీ తప్పు పడుతుంటే, అందులోని కీలక అంశాల గురించి మచిలీపట్నం మొదలుకుని గుంటూరు వరకూ విస్తృతంగా, లోతుగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ మావిగన్ ప్రతిపాదన తర్వాత, టీడీపీలో ఒక రకమైన కలవరాన్ని చూడొచ్చు. అప్పటి నుంచి మావిగన్ కు దీటైన కౌంటర్ ఇవ్వడం చేతకాక టీడీపీ నేతలు తంటాలు పడుతున్నారు. అందుకు కౌంటర్గా జగన్ వ్యక్తిత్వ హననానికి టీడీపీ నేతలు దిగడాన్ని చూడొచ్చు. మొదటగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియా ముందుకొచ్చి వైఎస్ జగన్ పై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏదో అన్నారంటూ చెప్పుకొచ్చారు. అచ్చెన్నాయుడికి బొత్స సత్యనారాయణ ఘాటు రిప్లై ఇచ్చారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మీడియా ముందుకొచ్చారు.




2లో

# హోర్ముజ్ బంద్!

- ★ జలసంధి బయట అమెరికా.. లోపల ఇరాన్ దిగ్బంధం
- ★ సోమవారం రాత్రి 7.30 నుంచి అమల్లోకి
- ★ ఇరాన్ పోర్టులకు నౌకల రాకపోకలను అడ్డుకునేందుకు అమెరికా నేవీ ఏర్పాట్లు
- ★ జలసంధి దాటి వచ్చే ఇరాన్ నౌకలను పేల్చేస్తామని ట్రంప్ హెచ్చరిక
- ★ గల్ఫ్ దేశాలకు వెళ్లే వాటికి అనుమతి
- ★ తమ జోలికి వస్తే గల్ఫ్ దేశాల్లో పోర్టులకు రక్షణ లేనట్టేనన్న ఐఆర్‌జీసీ
- ★ ఇప్పటికే హోర్ముజ్‌లో ఇతర దేశాల నౌకల రాకపోకలను నిలిపివేసిన ఇరాన్
- ★ పూర్తిగా మూసుకుపోయిన జలసంధి
- ★ పర్షియన్ గల్ఫ్‌లోనే 15 భారత నౌకలు



# నారీ శక్తికి పట్టం కట్టేందుకే!

మహిళా బిల్లుపై అమీతుమీ!
మహిళా రిజర్వేషన్లపై ప్రధాని
2029 నుంచే చట్టసభల్లో అమలు
ఈ శతాబ్దికే అతి ముఖ్య నిర్ణయం
నారీ శక్తి వందన్ సదస్సులో మోదీ
అత్యున్నత పదవుల్లో 'ఆమె'
అన్ని పార్టీలదీ అదే ఆకాంక్ష
గృహస్తును కాకపోయినా సాదకబాధకాలు తెలుసు!
నెగ్గించుకోవడానికి దూకుడుగా మోదీ అడుగులు.
తగినంత బలం లేకున్నా ముందుకే అంటున్న ఎన్డీఏ
ఎల్లుండి నుంచి దీనిపైనే పార్లమెంటు
21వ శతాబ్దంలో తీసుకుంటున్న అతిపెద్ద నిర్ణయం: ప్రధాని మోదీ




# నేడు బీహార్ కొత్త ముఖ్యమంత్రి ఎంపిక

**నేడు బీహార్ సీఎం పదవికి నితీష్ కుమార్ రాజీనామా**
**మంగళవారం సాయంత్రం కొత్త సీఎం ఎంపిక**
**బుధవారం కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం**

బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ప్రస్థానం రేపటితో ముగుస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్



# భారత్ నౌకలకు టోల్ వసూల్ చేయడం లేదు




- మా సామర్థ్యం ఏంటో అమెరికాకు తెలుసు : ఇరాన్
- భారత నౌకల నుంచి టోల్ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఖండించిన ఇరాన్
- శాంతికికే కాదు యుద్ధానికీ సిద్ధమే'
- 'ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే హర్మూజ్'
- భారత్ విశ్వసనీయ భాగస్వామి : ఫతాలీ
- ఒప్పందాలను ఉల్లంఘించిన అమెరికా– ఇజ్రాయెల్

# టీడీపీని వెంటాడుతున్న మావిగన్ - జగన్‌ను వెంటాడుతున్న టిడిపి..?

మావిగన్ పై ఆయన వద్ద సమాధానం లేదు. అసలు మావిగన్ గురించి మాట్లాడేందుకు ఆయన ససేమిరా అన్నట్టు వ్యవహరించారు. సహజంగానే జగన్, ఆయన పార్టీపై పయ్యావుల వ్యక్తిగత దూషణలకు దిగారు. తాజాగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయకుడు వంతు వచ్చింది. ఆల్రెడీ టీడీపీ తయారు చేసిన జగన్, వైసీపీ వ్యక్తిత్వ హనన స్క్రిప్ట్ ని వినిపించారు. వైసీపీ అనేది రాజకీయ పార్టీనే కాదని, గొడ్డలి పార్టీ అంటూ విమర్శించారు. అలాగే వివేకా, ఇతర హత్య కేసుల్లోని నిందితులంతా ఎందుకు అనుమానస్పద స్థితిలో చనిపోతున్నారని ఆయన పాత విమర్శల్నే పునరావృతం చేశారు. మరోవైపు ఉత్తరాంధ్ర టీడీపీ ఎంపీలు తమ ప్రాంతానికే చెందిన వైసీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు పదేళ్ల క్రితం జగన్ పై చేసిన తీవ్ర విమర్శలంటూ పేపర్ క్లిప్పింగ్లను ప్రదర్శించడం గమనార్హం. వైఎస్ జగన్ అంటే ప్రమాదకరమని, క్రిమినల్ అని పదేపదే చెబుతూ, రాష్ట్ర ప్రజానీకంలో ఒక రకమైన భయాన్ని సృష్టించే ప్రయత్నం బలంగా జరుగుతోంది. అయితే జగన్ పై ఇదేమీ కొత్తది కాకపోయినా, ఇప్పటికే ఉన్న భయాన్ని పోగొట్టకుండా నిలపాలనే వ్యూహంతో టీడీపీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇదంతా కూడా వైఎస్ జగన్ మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చిన నేపథ్యంలో సాగుతున్న తంతుగా గమనించాలి. వైఎస్ జగన్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, సహచర మంత్రులు, ఎమ్మెల్యేల తీవ్ర ఆరోపణల్ని గమనిస్తే ......అంతా ఒక పథకం ప్రకారమే సాగుతున్నట్టు స్పష్టమవుతోంది. అదేంటో గానీ, మావిగన్ ప్రతిపాదనపై చర్చకు టీడీపీ భయపడుతోంది. మావిగన్ ప్రతిపాదన ఒక పిచ్చి చేష్టగా మొదట్లో ఆరోపించిన వాళ్లంతా, ఇప్పుడు దాని గురించి మాట్లాడ్డానికి జంకుతున్నారు. మావిగన్ ప్రతిపాదనలో 110 కిలోమీటర్ల రాజధాని కారిడార్ వుంది. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలున్నాయి. 60 లక్షల జనాభాకు సంబంధించిన ప్రయోజనాలు దాగి ఉన్నాయి. మావిగన్ ప్రతిపాదన ఎలా తప్పో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీలకు వివరించొచ్చు. అసలు ఆ ప్రతిపాదన శుద్ధ దండగ అని బలంగా చెప్పగలిగే సమాచార సాధన సంపత్తి టీడీపీ సొంతం. అత్యంత కీలకమైన రాజధానిపై చర్చించడానికి అనుకూల పత్రికలు, టీవీ చానెల్స్ను వాడుకోకుండా, నిత్యం జగన్ను తిట్టడానికి మాత్రమే దుర్వినియోగం చేయడం విడ్డూరంగా వుంది. రోజూ జగన్ను తిడితే లాభం ఏంటో వారికే తెలియాలి. అమరావతి నిర్మాణానికి లక్షల కోట్లు ఖర్చు అవుతుందని జగన్తో పాటు ఆయన పార్టీ నేతలు బలంగా చెబుతున్నారు. ఇదే రూ20 వేల కోట్లతో మూడు నగరాల్ని కలుపుతూ మహా నగరాన్ని నిర్మించొచ్చని జగన్ అంటున్నారు. ఏది మంచిదో ఆలోచించాలని ఆయన అభ్యర్థిస్తున్నారు. అలాగే కొత్త నగరాన్ని నిర్మించడానికి లక్షల కోట్లు ఖర్చు పెట్టే బదులు, ఆల్రెడీ ఉన్న వాటిని అభివృద్ధి చేసుకుంటే బాగుంటుంది కదా అనే ప్రశ్నకు కూటమి వైపు నుంచి సమాధానం లేదు. ఈ నేపథ్యంలో ప్రతి రోజూ ఒకరిద్దరు మంత్రులు మీడియా ముందుకు రావడం, జగన్, ఆయన పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు చేయించేందుకు టీడీపీ ఒక ప్రణాళిక రూపొందించింది. దాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది. అయితే టీడీపీ అనుకుంటున్నట్టు జగన్ పై తీవ్ర ఆరోపణలతో జనం భయపెడుతూ, అబ్బే ఏమీ చేయకపోయినా కూటమే బెటర్ అనుకునే పరిస్థితి వుందా? అనేదే ప్రశ్న. ఇంకో వైపు టీడీపీ భయాన్ని వైసీపీ పసిగట్టింది. అందుకే మావిగన్ పై మరింత బలంగా ఆ పార్టీ మాట్లాడుతోంది. అమరావతి పేరుతో టీడీపీ భూదోపిడీ గురించి వైసీపీ విమర్శలు చేస్తోంది. అలాగే అమరావతిలో నిర్మాణాలకు మిగిలిన మహా నగరాల కంటే రెండు, మూడింతల ఖర్చు ఎక్కువగా పెట్టడం వెనుక దోపిడీని వివరిస్తోంది. అలాగే కొత్త నగరం నిర్మాణం అవసరం లేకుండానే, మావిగన్ పేరుతో జగన్ ప్రతిపాదించిన అంశాల గురించి జనంలోకి బలంగా వైసీపీ తీసుకెళ్తాంది. ఒకవైపు వైసీపీ నేతలు మావిగన్ గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంటే, దానికి విరుగుడుగా అన్నట్టు జగన్పై వ్యక్తిత్వ హనన విమర్శల్ని టీడీపీ తీవ్రతరం చేసింది. ఈ రెండింటిలో జగన్ వేటి వైపు ఆకర్షితులవుతున్నారనేదే ఇప్పుడు ప్రధాన అంశం. అయితే జగన్, వైసీపీపై విమర్శలు జనానికి అలవాటయ్యాయి. ఇప్పుడు మావిగన్ చుట్టూ చర్చ, రచ్చ సాగుతున్నాయనేది నిజం.

# హోర్ముజ్ బంద్!

ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలకమైన హోర్ముజ్ జలసంధి పూర్తిగా దిగ్బంధంలోకి వెళ్లిపోయింది. గల్ఫ్ దేశాల పోర్టులకు రాకపోకలు సాగించే నౌకలను ఇరాన్ ఇప్పటికే నిలిపివేయగా... ఇప్పుడు ఇరాన్ పోర్టులకు రాకపోకలు సాగించే నౌకలను అడ్డగింతకు అమెరికా ఏర్పాట్లు చేసింది. దీనితో హోర్ముజ్ జలసంధి పూర్తిగా మూసుకుపోయింది. ఇప్పటివరకు కొన్ని నౌకలైనా బయటికి రాగా.. ఇకపై ఒక్కటీ బయటికొచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇరాన్ నౌకలు జలసంధి దాటి బయటికి వస్తే పేల్చేస్తామని అమెరికా హెచ్చరిస్తే.. తమ జోలికి వస్తే గల్ఫ్ దేశాల్లోని పోర్టులు వేటికీ రక్షణ ఉండదంటూ ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఘాటుగా స్పందించింది. దీనితో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఏ క్షణంలోనైనా కాల్పుల విరమణ ముగిసి, యుద్ధం మొదలుకావొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో జరిగిన ఇరాన్-అమెరికా శాంతి చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. అణు కార్యక్రమాన్ని వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించకపోవడంతోనే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందన్న ట్రంప్.. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. దీనికి సంబంధించి సోమవారం ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్ పోర్టులకు వెళ్లే, ఆ దేశ పోర్టుల నుంచి వచ్చే నౌకలను సోమవారం సాయంత్రం 5.30 గంటల(అమెరికా కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 10 గంటల) నుంచి అడ్డుకుంటామని పేర్కొన్నారు. అధ్యక్షుడి నిర్ణయానికి అనుగుణంగా పశ్చిమాసియాలోని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన విడుదల చేసింది. "పర్షియన్ గల్ఫ్‌తోపాటు గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని ఇరాన్ పోర్టులు, తీర ప్రాంతాలకు వెళ్లే, అక్కడి నుంచి బయలుదేరే అన్ని నౌకలను అడ్డుకుంటాం. అవి ఏ దేశానికి చెందినవైనా సరే ఈ దిగ్బంధం వర్తిస్తుంది. హోర్ముజ్ జలసంధి మీదుగా మిగతా గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగించే నౌకలకు ఎటువంటి ఆటంకం ఉండదు.

# అమరావతిలో మరో కీలక ఘట్టం

అమరావతిలో భారత్‌లో నిర్మితమై, భారతదేశానికి అందుబాటులో, ప్రపంచానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. క్వాంటమ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం :** మంగళవారం గన్నవరంలోని మేధా టవర్స్?తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్?లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్?ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది. మేధాటవర్స్?లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్?లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్?లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

**దేశంలోనే తొలిసారిగా :** అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్?లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్?ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్ ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్?ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్ ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరు కానున్నారు. ఏపీలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్ గా దాదాపు 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**తయారీ రంగంలో ముందడుగు :** అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుతో పాటు, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయి క్వాంటమ్ కంప్యూటర్లను, విడిభాగాల్ని అక్కడే తయారుచేసి ఎగుమతి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. గత ఏడాది సెప్టెంబరు 9న హార్డ్‌వేర్ విడిభాగాల తయారీదారులతో ముఖ్యమంత్రి జరిపిన సమావేశంలో క్వాంటమ్ విడిభాగాల టెస్టింగ్, వ్యాలిడేషన్, బెంచ్‌మార్కింగ్, సర్టిఫికేషన్ కోసం రిఫరెన్స్ సదుపాయాలు కావాలని వారు కోరారు. అమరావతిలో రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కల్పించాలన్న నిర్ణయం అప్పుడే జరిగింది. ఈ సదుపాయాలు రావడంతో అమరావతిలోనే క్వాంటమ్ పరికరాలు తయారుచేసేందుకు దేశంలోని పలు సంస్థలు ముందుకొచ్చే అవకాశం ఉంది. మన దేశంలో ప్రస్తుతం కొన్ని సంస్థలు క్వాంటమ్ విడిభాగాలు తయారుచేస్తున్నా, ప్రాసెసర్ల వంటివాటిని టెస్టింగ్ కోసం విదేశాలకు పంపాల్సి వస్తోంది. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌తో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ రంగంలో భారత్ పెద్ద ముందడుగు వేయనుంది.

**క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా :** అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ కోసం తయారు చేసిన క్రయోజెనిక్స్, ప్రిసిషన్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, క్వాంటమ్ గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ పరికరాలు, సదుపాయాలు కేవలం క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా, రక్షణ, ఆరోగ్య, సెమీకండక్టర్ తయారీ వంటి రంగాలకూ ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. క్రయోజెనిక్ సిస్టమ్స్‌ను ఎంఆర్ఐ మెషీన్లు, స్పేస్ అప్లికేషన్లలో వినియోగిస్తారు. ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సెన్సింగ్, రాడార్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌కు ఉపయోగపడుతుంది. క్వాంటమ్‌గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ సదుపాయాలను సెమీకండక్టర్ల తయారీ, డీప్‌టెక్ ఇండస్ట్రియల్ అప్లికేషన్లలో వినియోగిస్తారు.

# నేడు బీహార్ కొత్త ముఖ్యమంత్రి ఎంపిక

సేవలందించారు. అయితే అనూహ్యంగా గత నెలలో రాజ్యసభకు వెళ్లిపోయారు. ఈ నిర్ణయం యావత్తు దేశాన్ని షాకింగ్‌కు గురి చేసింది. ఇక ముఖ్యమంత్రి పదవికి నితీష్ కుమార్ రాజీనామా చేయనున్నారు. అయితే ఈసారి ముఖ్యమంత్రి పదవి జేడీయూకు కాకుండా బీజేపీకి దక్కుతోంది. దీంతో నితీష్ కుమార్ వారసుడిగా బీజేపీ వ్యక్తి రాబోతున్నట్లుగా తేలిపోయింది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పాట్నాలో ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసి ప్రకటించనుంది. అయితే నితీష్ కుమార్ వారసుడి ఎవరన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అనేక పేర్లు తెరపైకి వచ్చాయి. డిప్యూటీ సీఎంగా ఉన్న సామ్రాట్ చౌదరికి ఈ పదవికి దక్కుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. బీజేపీ హైకమాండ్ కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. ఒకవేళ ఆయన కాకపోతే కేంద్రమంత్రికి ఆ పదవి దక్కొచ్చని వినిపిస్తోంది. మొత్తానికి ఎవరనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ఇక ముఖ్యమంత్రి పేరు ప్రకటించగానే.. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రమణ స్వీకార కార్యక్రమం జరగనుంది. గతేడాది నవంబర్‌లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సునామీలా దూసుకెళ్లింది. దాదాపు 202 సీట్లు కైవసం చేసుకుంది. తిరిగి లేని శక్తిగా మారింది. ఇక ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా చతికిలపడ్డాయి. తేజస్వి యాదవ్ ప్రతిపక్ష స్థానంలో కూర్చొన్నారు.

# నారీ శక్తికి పట్టం కట్టేందుకే!

చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కోసం మహిళల దశాబ్దాల ఎదురుచూపులకు అతి త్వరలో తెర పడనుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేలా నారీ శక్తి వందన్ అధినియమ్‌కు రాజ్యాంగ సవరణ చేపట్టనున్నట్టు గుర్తు చేశారు. ఇందుకోసం గురువారం నుంచి పార్లమెంటు మూడు రోజుల పాటు సమావేశం కానుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో జరిగిన 'నారీ శక్తి వందన్'సదస్సును ఉద్దేశించి మోదీ మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల రూపంలో ఈ శతాబ్దిలోకెల్లా అతి ముఖ్యమైన నిర్ణయాన్ని భారత్ అతి త్వరలో తీసుకోబోతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దాన్ని నారీ శక్తికే అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. "మహిళా రిజర్వేషన్ల చట్టానికి రాజ్యాంగ సవరణ ద్వారా మన పార్లమెంటు కొత్త చరిత్ర సృష్టించనుంది. మనందరి జీవితకాలంలో దేశ చరిత్రలోనే అతి ముఖ్యమైన నిర్ణయంగా ఇది మిగిలిపోనుంది. మహిళా సాధికారతకు నిదర్శనంగా, వారి శక్తియుక్తులకు నిజమైన నివాళిగా నిలవనుంది. భారత్‌లో స్త్రీ పురుష సమతావాదం, సామాజిక న్యాయం కేవలం నినాదాలు కావని, రోజువారీ పని సంస్కృతి మొదలుకునిఅత్యున్నత నిర్ణయ ప్రక్రియ దాకా అన్నింట్లోనూ అవి విడదీయలేని భాగమని నిరూపించనుంది. భారత మహిళలు ఇప్పటికే పాలనలో అన్ని స్థాయిల్లోనూ నిర్ణాయక పాత్ర పోషిస్తూ తమను తాము నిరూపించుకుంటున్నారు. మున్ముందు మరిన్ని పెద్ద బాధ్యతలను సమర్థంగా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నారు"అంటూ కొనియాడారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2027 జనగణనతో ముడిపడి ఉన్నాయి. దాంతో ప్రస్తుత చట్టం ప్రకారం వాటిని 2034 నుంచి మాత్రమే అమలు చేయడం వీలు పడుతుంది. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను 816కు పెంచనున్న నేపథ్యంలో 273 స్థానాలు మహిళలకు రిజర్వు కానున్నాయి.

# భారత్ నౌకలకు టోల్ వసూల్ చేయడం లేదు

అమెరికా- ఇరాన్ యుద్ధంపై భారత్?లోని టెహ్రాన్? రాయబారి మహమ్మద్ ఫతాలీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ డిమాండ్లను అంగీకరిస్తే అమెరికాతో మరోసారి చర్చలకు సిద్ధమేనని చెప్పారు. అలాగే హర్మూజ్ జలసంధి తమ దేశ ప్రాదేశిక జలాల్లో ఉందని తెలిపారు. భారత్?తో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, హర్మూజ్ నుంచి వెళ్లే ఆ దేశ నౌకల నుంచి ఎలాంటి టోల్ వసూలు చేయడం లేదని వెల్లడించారు. దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడతూ ఫతాలీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**'శాంతికికే కాదు యుద్ధానికీ సిద్ధమే' :** తమ ఉన్నతాధికారులు, ప్రతినిధి బృందం శాంతికి సిద్ధంగా ఉందని ఇరాన్ రాయబారి ఫతాలీ తెలిపారు. చర్చలకు కూడా సిద్ధమే, కానీ ఇరాన్ యుద్ధానికీ రెడీగా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చల్లో అణు కార్యక్రమం, ఆంక్షల ఎత్తివేత, యుద్ధ పరిహారం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అయితే అమెరికా చేసిన చట్టవిరుద్ధమైన డిమాండ్ల వల్లే ఒప్పందం కుదరలేదు.

**'ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే హర్మూజ్' :** ఇదే క్రమంలో హర్మూజ్ అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ రాయబారి స్పందించారు. ఇరాన్ సామర్థ్యాల గురించి అమెరికాకు బాగా తెలుసని అన్నారు. యుద్ధానికి ముందు ఈ మార్గం తెరిచి ఉందని, కానీ దాడుల తర్వాత పరిస్థితులు మారాయని చెప్పారు. హర్మూజ్ జలసంధిపై అమెరికా దిగ్బంధిస్తే అది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అవుతుందని హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే ఉందని, ఆ జలాలను కాపాడుకోవడానికి తమకున్న హక్కులను వినియోగించుకుంటామని తెలిపారు. స్నేహపూర్వక దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు హర్మూజ్? మార్గాన్ని తెరిచి ఉంచుతామని వివరించారు.

**భారత్ విశ్వసనీయ భాగస్వామి : ఫతాలీ**

కష్టకాలంలో భారత్ ప్రభుత్వం, ప్రజలు చూపిన మద్దతుకు ఫతాలీ కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రజలు నిజంగా విశ్వసనీయులు, సహానుభూతి గలవారని అన్నారు. భారత్ ప్రభుత్వంతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ దేశ నౌకలకు సురక్షిత ప్రయాణం కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి భారత్‌ను అత్యంత సన్నిహిత మిత్ర దేశాలలో ఒకటిగా పేర్కొన్నారని తెలిపారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా భారత్?కు చెందిన ఎల్?పీజీ నౌక జాగ్? విక్రం విజయవంతంగా హర్మూజ్ జలసంధి దాటింది. ఈ నౌకతో పాటు ఇప్పటికే మరో ఎనిమిది భారత నౌకలు కూడా సురక్షితంగా ఈ మార్గం దాటినట్లు సమాచారం.

**ఒప్పందాలను ఉల్లంఘించిన అమెరికా- ఇజ్రాయెల్**

అమెరికా, ఇజ్రాయెల్ ఒప్పందాలను ఉల్లంఘించాయని ఫతాలీ ఆరోపించారు. చర్చలు జరుగుతున్న సమయంలోనే దాడులు జరిగాయని, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. తమ దేశంపై అమెరికా-ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా చేసిన దాడుల్లో 3375 మంది పౌరులు మృతి చెందినట్లు తెలిపారు. ప్రాణ నష్టంతో పాటు గణనీయమైన ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఇరాన్‌పై వివిధ రకాల ఆంక్షలు విధించారని, అయినప్పటికీ దేశం స్వావలంబన దిశగా ముందుకు సాగిందని చెప్పారు. సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ సూచనలతో దేశీయ ఉత్పత్తిపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా హర్మూజ్ జలసంధిని నౌకాదళంతో నిరోధించే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో, పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది. మళ్లీ ఇరుపక్షాలు మధ్య ప్రత్యక్ష చర్చలు ఎప్పుడూ జరుగుతాయో కూడా స్పష్టత లేదు. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో అని ఆందోళన నెలకొంది.

## హైదరాబాద్ -- తిరుపతి...
## విమానయానం సామాన్యుడికి గగనమే

**ఉడాన్ లక్ష్యాలకు విరుద్ధంగా విమాన చార్జీల భారం**

**ధరల నియంత్రణకు కేంద్రం చర్యలు తీసుకోవాలి**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి లేఖ**

హైదరాబాద్-- తిరుపతి మార్గంలో విమాన చార్జీల పెంపుపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉడాన్' లక్ష్యాల్లో ఒకటైన 'సామాన్యుడికి విమానయానం' ఆశయానికి విరుద్ధంగా ఈ చార్జీల బాదుడు కొనసాగుతోందని మండిపడ్డారు. పెరిగిన విమాన చార్జీలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ఎంపీ లేఖ రాశారు. లేఖలో ముఖ్యాంశాలు.. దేశంలోని ఇతర ప్రధాన నగరాల కంటే తిరుపతికి వెళ్లే విమాన ప్రయాణం అత్యంత ఖరీదుగా మారింది. దీనిప్రకారం హైదరాబాద్ నుంచి గోవా (రూ. 3,000--రూ. 6,500), ఢిల్లీ (రూ. 3,90ఌ0--ఌరూ. 7,ఌ0ఌ00), చెన్నై (రూ. 2,5ఌ00--ఌరూ. 4,000)కు ఉన్న చార్జీల కంటే తిరుపతి రూట్‌లోనే అత్యధికంగా వసూలు చేస్తున్నారు. హైదరాబాద్--తిరుపతి మధ్య కనీస చార్జీ రూ. 6,000 నుంచి ప్రారంభమై రూ. 9,500 వరకు ఉంటోంది. కొన్ని సందర్భాల్లో ఇది రూ. 14,500కు చేరుతోంది. ఇక 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు 13,367 విమానాల్లో దాదాపు 11.84 లక్షల మంది ప్రయాణికులు హైదరాబాద్--తిరుపతి రూట్‌లో ప్రయాణించారు.

# శిక్ష

దోచుకునే అలవాటు
దోషం కాదా?
పడదోసే ఆలోచన
పాపం అనిపించుకోదా?
మనిషి అసూయ పడితే
ఆస్థులు వస్తాయా?
కుళ్ళు కుతంత్రాలతో
కాసులెలా వస్తాయ్?
నీ ఇళ్లంతా నీ ఒళ్ళంతా
పాపిష్టి ధనంతో ఉండిపోతే
నీ బ్రతుకంతా అబద్ధాలతో
అవినీతితో నిండిపోతే
నిన్ను దేవుడెందుకు
బాగుచేయగలడు?
కర్మ ఎవ్వరినీ వదిలిపెట్టదు
అన్యాయంగా ఒకరిని ఒప్పించి
అక్రమంగా డబ్బు సంపాదించి
అసలు నువ్వు పొందే ఆనందం
కేవలం తాత్కాలికం మాత్రమే
ఎంతో మనసు గాయపడిన
ఆ మనిషి కన్నీటి ఉసురుతో
ఖచ్చితంగా నీ మూడు తరాలకు
సరిపడే శిక్ష పడుతుంది.



రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

# చలివేంద్రం ప్రారంభం



ఎండా కాలంలో చలివేంద్రాలు ఎంతో అవసరమని నెల్లూరు జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు పేర్కొన్నారు. మేడిది సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు బాలాజీ నగర్ లోని మాగ్నెట్ ఫ్లెక్స్ ప్రింటింగ్ దగ్గర చలివేంద్రం ప్రారంభం జరిగింది. మొదటి రోజు మజ్జిగతో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదాచారులకు వేసవి తాపాన్ని తీర్చాలంటే ఇటువంటి వేంద్రాలు సామాన్య ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర జర్నలిస్టు సంఘం నాయకులు ఎ.జయప్రకాష్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ మేడిది వెంకటేశ్వర రావు ఎంతో అభినందనీయులని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీదరాల చెన్నయ్య, విశ్రాంత ఉపకార్మిక కమీషనర్ డాక్టర్ రాచపాలెం రఘు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు ఎమ్.రోజా రాణీ, ఎస్.సౌజన్య, జోష్న, శ్రీకర్ రెడ్డి, భరత్ కుమార్ రాజు, అలీ తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి.

**- సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి.**



గూడూరు న్యూస్. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కి పార్టీ నీ తీసుకువెళ్లి క్షేత్ర స్థాయి లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. కార్మిక , కర్షక , పేదల సమస్య ల పట్ల నిరంతరం సీపీఐ పోరాడుతుందన్నారు. వందేళ్ళుగా ప్రజా సమస్యల పట్ల నిరంతరం సీపీఐ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన కార్మికులు , కర్షకులు , పేద ప్రజలు తీవ్రంగానష్టపోతున్నారన్నారు. యుద్ధం సాకుతో గ్యాస్ దొరక్క వ్యాపారులు , ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ తోనే ప్రజా సమస్యల పరిష్కారమన్నారు. మే డే ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్.ప్రభాకర్ , సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ , ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, బి. కె. ఎం. యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసా మూర్తి , తదితరులు పాల్గొన్నారు.

## ఆకలితో ఉన్నవారికి అన్నదానం..!



**- పుట్టినరోజును సేవా దినంగా మార్చిన దంపతులు..!**

గూడూరు పట్టణానికి చెందిన అత్తి మంజరి గోపాల్, మల్లేశ్వరి దంపతుల కుమారుడు రామ శివకృష్ణ పుట్టినరోజు సందర్భంగా చిల్లకూరు మండలం చిల్లకూరు కట్టకింద ఉన్న శారద నగర్ లో ఎలాంటి ఆర్భాటాలకు దూరంగా, ఆకలితో ఉన్నవారికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వీరు నిత్యం అన్నదానం చేస్తూ, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. డబ్బుతో కాకుండా దయతో చేసే సేవ ఎప్పటికీ కొనసాగుతుందని వీరు నిరూపించారు. సమాజానికి ఏదైనా ఇవ్వాలనే వీరి తపన రేపటి తరానికి స్ఫూర్తినిస్తుంది. కృపసేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ:–పుట్టినరోజు వేడుకలు ఆడంబరంగా జరుపుకోకుండా పేదలకు సహాయం చేస్తే అందులో ఉన్న తృప్తి మరెందులోనూ ఉండదన్నారు. రామ శివకృష్ణ పుట్టినరోజున వృద్ధులకు,చిన్నారులకు అన్నదానం చేయడం వారికి ఎంతో సంతృప్తిని ఇచ్చింది.అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు అత్తి మంజరి గోపాల్ సభ్యులు పర్వతాల రమేష్, పేయ్యల రమణయ్య, చవల సురేంద్ర, కసుకుర్తి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .

# అర్ధ రాత్రి బీజేపీ కార్యాలయం తొలగింపు.

**-కార్యకర్తల ఆగ్రహం**
**-కమిషనర్ నందన్ వల్ల కూటమి ప్రభుత్వం కు చెడ్డ పేరు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీ ధర రెడ్డి**





**నెల్లూరు సిటీ.ఏప్రియల్ 13/ ....(విజ్ఞాన్ ప్రతినిధి )** నెల్లూరు నగరం లో మున్సిపల్ కమిషన్ వ్యవహారిస్తున్న తీరు కు కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకో వల్సి వస్తుంది మంత్రి నారాయణ ఒక్కసారి ఆలోచించాలి కమిషనర్ వ్యవహారం పై ఇప్పటికే విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీ ధర్ రెడ్డి సోమవారం 3,వ డివిజన్ కిసాన్ నగర్ లో ఉన్న బీజేపీ కాంటైనార్ కార్యాలయం ను ఆదివారం అర్ధ రాత్రి అక్రమంగా తొలగించరాని తాము కూటమి ప్రభుత్వం లో ఉన్న లెక్క చేయకుండా కమిషనర్ వ్యవహారించడం తాము ఖండిస్తున్నట్లు తెలిపారు... కనీసం నోటీసు కూడ ఇవ్వకుండా పోలీస్ ఫోర్స్ తో తొలగించడం ఏమిటన్ని మండిపడ్డారు. కార్యాలయం జెండా తొలగింపు దుర్మార్గం... ధర్మసానం వెంకటేష్ .. కిసాన్ నగర్ మండలాధ్యక్షుడు.... బీజేపీ కార్యాలయం పార్టీ జెండా దిమ్మెను తొలగించడం దారుణమని బీజేపీ కిసాన్ నగర్ మండలాధ్యక్షుడు డి. వెంకటేష్ మున్సిపల్ కమిషనర్ తీరును ఖండించారు.. అర్ధ రాత్రి పార్టీ వాళ్ళకు కనీససమాచారం ఇవ్వకుండా చేయడం నియంత పాలన చేసినట్లు ఉందన్నారు...

# లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ నూతన కమిటీ ఎంపిక

**-అభినందనలు తెలిపిన ఇంచార్జ్ ఆత్మకూరు రామకోటయ్య**



**కావలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ :** లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ నూతన కమిటీ సోమవారం రాష్ట్ర కార్యాలయం నుండి నియామక పత్రం విడుదల చేశారు కావలి మండలం అధ్యక్షులు –కాటంగారి బాబు, దగదర్తి మండలం అధ్యక్షులు –జూపూడి మల్లయ్య, అల్లూరు మండలం అధ్యక్షులు దాసరి దేవకుమార్, కావలి రూరల్ బిట్ 1–అధ్యక్షులు ఆత్మకూరు నాగార్జున, కావలి రూరల్ బిట్ 2–నాగార్జున నాయుడు, కావలి రూరల్ మండలం గిరిజన సంఘం అధ్యక్షులు సి హెచ్ సుబ్రహ్మణ్యం, కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి –కాటంగారి చిట్టిబాబు నియమిస్తూ సోమవారం రాష్ట్ర కార్యాలయం నుండి నియమక పత్రాలు రిలీజ్ చేశారు . ఈ సందర్భంగా కావలి నియోజవర్గ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆత్మకూరు రామకోటయ్య అభినందనలు తెలిపారు.

# చెరువు లో మైనింగ్ లీజు కొరకు యిచ్చిన ఎన్ ఓ సి ను వెంటనే రద్దు చేయాలి

**-అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు డి పి పోలయ్య డిమాండ్**



**సైదాపురం, విజ్ఞాన్ దిన పత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 13** సైదాపురం మండలం తుమ్మలతలుపూరు గ్రామం లో చెరువులో అక్రమ మైనింగ్ కు యిచ్చిన ఎన్ ఓ సి ను వెంటనే రద్దు చేయాలని చెరువుల్లో వాగుల్లో మైనింగ్ ఇవ్వద్దని సుప్రీం కోర్టు ఆర్డర్ కు బిన్నంగా సి వి సి మైనింగ్ పర్మిషన్ కు అనుమతుల కు ఎన్ ఓ సి యిచ్చిన అధికారులు పై చర్యలకు డిమాండ్ చేస్తూ సైదాపురం లోని ఏ ఐ కె ఎం ఎస్ నెల్లూరు జిల్లా కార్యాలయం లో తుమ్మల తలుపూరు పంచాయతీ లోని చెర్లోపల్లి ప్రజలకు మద్దతు ప్రకటిస్తూ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మల తలుపూరు చెరువులో కొత్తగా సివి సి మైనింగ్ ను పెట్టడానికి ఆ కంపెనీ అదినేత విశ్వేశ్వర రావు ఇతర గ్రామాల నుండి తన కున్న మరో మైనింగ్ లో పని చేసే కూలీల తో ప్రాంతీయ పర్యావరణ శాఖ ఏర్పాటు చేసిన బహిరంగ ప్రజా వేదిక కు తమ అభిప్రాయాలను గ్రామస్తులను కాదని బెటాలియన్ పోలీస్ లతో మోహరించి వారి కంపెనీ కూలీలతో చెప్పించడానికి పూనుకోవడం గమనించిన గ్రామస్తులు నల్ల బ్యాడ్జి లతో అధికారుల వద్ద ప్రజలు ముక్త కంఠం తో నిరసన లు మైనింగ్ వద్దు అని బహిరంగ వేదికలో వినిపించడం అభినందనీయమన్నారు. గ్రామం లోని చెరువు వరవ కాలువలను పచ్చని పంటలు కాదని మైనింగ్ మాఫియా కు చెరువులో మైనింగ్ కు యిస్తామంటె నివాస ప్రజల ప్రాణాలను రైతులను రైతు కూలీలను గ్రామాన్ని నాశనం చేసి రోడ్డున పడేయటమే లక్ష్యంగా పెట్టుకోవడం దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూగ జీవాల మనుగడకు మనుషుల జీవితాలను నాశనం చేసే లా అక్రమంగా ఈ చెరువు లో మైనింగ్ కు యివ్వాలని చూడటం దుర్మార్గ మన్నారు.మైనింగ్ మాఫియా ముడుపులకు చెరువులో కూడా రెవిన్యూ శాఖ అధికారులు అనుమతులకు ద్వారాలు తెరవడం విడ్డూరంగా ఉందని మండి పడ్డారు.అక్రమ మైనింగ్ కు ఎన్ ఓ సి యిచ్చిన అధికారులు పై చర్యలకు ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ప్రజలు మూగ జీవాల మనుగడకు విఘాతం కలిగించే యిలాంటి మైనింగ్ అనుమతులు వెంటనే రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెరువులో మైనింగ్ అనుమతులు రద్దు చేయకుంటే ప్రజలను చైతన్య పరచి జిల్లా స్థాయి లో ఈ మైనింగ్ వ్యవహారం పై ప్రజలకు పర్యావరణానికి కలుగుతున్నా ఇబ్బందుల పై ప్రజలకు మద్దతు గా జిల్లా స్ధాయి లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ప్రగతి శీల మహిళా జిల్లా కన్వీనర్ బి మమత, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు కె చంగల్ రావు, బి సి డబ్ల్యు యు వ్ అధ్యక్ష కార్యదర్శులు డి నవ కోటి, ఎం అనిల్, అన్న జయ్య లు పాల్గొన్నారు.

# కలెక్టర్ తో భేటీ అయిన మేయర్ దంపతులు



నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ దంపతులు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ హిమాన్షు శుక్ల తో కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ముందుగా జిల్లా కలెక్టర్ ను మేయర్ దంపతులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాల గురించి మేయర్ దంపతులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరద బాధితుల సహాయార్థం పి4 పథకంలో భాగంగా ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను వారు కోరారు.

# పత్రిక లే ప్రజాస్వామ్యం లో పట్టు కొమ్మలు

**-విజ్ఞాన్ పత్రిక డైరీని ఆవిష్కరించిన డాక్టర్ స్వరూప్ కుమార్**
**-. ఉదయ్ కుమార్ ని ప్రశాంశించిన డాక్టర్నె**



**ల్లూరు సిటీ... ఏప్రియల్.. 12/ (విజ్ఞాన్ ప్రతి నిధి )** దేశ స్వతంత్ర పోరాటం నుంచి నేటి వరకు పత్రిక లు సమాజం లో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇటు ప్రభుత్వం కు ప్రజలకు మధ్య వారదులు పత్రిక లేనన్న అన్నారు కేర్ డెంటల్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి అధినేత డాక్టర్ స్వరూప్ కుమార్ ఆదివారం ఆయన విజ్ఞాన్ దినపత్రిక వార్షిక డైరీ ని ఆవిష్కరణ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రపంచంలో ఏమూల ఏమి జరిగిన వెంటనే క్షణాలో ప్రపంచం కు తెలిపేదే వార్త పత్రిక లే నన్ని పేర్కొన్నారు.. కేవలం పోటీ తత్త్వం కాకుండా ప్రజలకు మంచి వార్తలు అందించాలని కోరారు ప్రస్తుతం పత్రికలు స్వంతంగానడపటం అంటే ఎన్నో వ్యాయప్రయాసలు ఎదుర్కొని నిలబడిల్సిన పరిస్థితి ఉందన్నారు... యువకుడు విజ్ఞాన్ పత్రిక సంపాకుడు ఉదయ్ కుమార్ రెడ్డి కీ మంచి భవిష్యత్ ఉ ందన్నారు.ఈ సందర్భంగా ఉదయ్ ని ప్రస్మశించారు..

# టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కందుకూరు నందు' నారీ శక్తి వందన్' కార్యక్రమం నిర్వహణ.

**కందుకూరు విజ్ఞాన్ రిపోర్టర్ ఏప్రిల్ 13** కందుకూరు నియోజకవర్గం లో టి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి కందుకూరు నందు 13వ తేదీన మహిళా సాధికారత విభాగం వారి ఆధ్వర్యంలో నారీ శక్తి ప్రోగ్రాం నిర్వహించబడింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం . రవికుమార్ మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న ఈరోజు చరిత్రలో నిలిచిపోయే రోజు అని తెలియజేశారు. ఈ బిల్లు ఆమోదించబడినట్లైతే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని ఇది శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఒంగోలులో కామర్స్ అధ్యాపకులుగా సేవలు అందిస్తున్న డాక్టర్ పి. కుసుమకుమారి మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబన కలిగిన మహిళలు కూడా ఇంకా సమాజంలో చాలామంది నిర్ణయాధికారం లేకుండా ఉండడం అనేది విచారకరమైన విషయమని తెలియజేశారు. మహిళలు స్వయం నిర్ణయాధికారం కలిగిన శక్తి స్వరూపులుగా ఎదగాలని వారు తెలియజేశారు.కళాశాల లోని చరిత్ర అధ్యాపకులు డాక్టర్ డి. రామాంజనేయులు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో



ఆమోదింపబడడం చాలా అవసరమైన విషయమని అంతేకాకుండా 33 శాతం కాకుండా 50 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు జరిగినట్లయితే ఇంకా బాగుంటుందనేది వారు తెలియజేశారు మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ కొమ్మనబోయిన సుజాత మాట్లాడుతూఎస్సీ ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ప్రాతిపదికగా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ కె వి పద్మావతి జువాలజీ అధ్యాపకులు డాక్టర్ అనూష హిందీ అధ్యాపకులు రాఘవరావు తెలుగు అధ్యాపకులు సి హెచ్ అలేఖ్య మ్యాథమెటిక్స్ అధ్యాపకులు ఎం శారద, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు టీ హరీష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మహిళా సాధికారత విభాగం వారు నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్ను తిలకించారు.

# మత్స్య కారుల సంక్షేమ కృషి చేసేది తెలుగుదేశం పార్టీ మాత్రమే



**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్ )ఏప్రిల్ 13** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేసేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని, అందుకే మత్స్యకారులు ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడ్డారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతుందని అన్నారు. బీజేపీ--జనసేన--తెలుగుదేశం సంకీర్ణ ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మత్స్యకార భరోసా పథకాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన అర్హులైన మత్స్యకారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అధిక శాతం లబ్ధిదారులకు ఈ పథకం అందుతున్నదని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలపై అపోహలు సృష్టిస్తూ మత్స్యకారులలో అయోమయం కలిగించే ప్రయత్నం వైసీపీ నేతలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాల్లో మత్స్యకారుల సంక్షేమానికి వైసీపీ తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. మత్స్యకారుల పై ప్రేమతో కాకుండా, కేవలం వైసీపీ తమ పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం జగన్ ను జువ్వలదిన్నె కు తీసుకొని వస్తున్నారని విమర్శించారు. జగన్ కార్యక్రమానికి మత్స్యకారులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో, బయటి నేతలను, కార్యకర్తలను తీసుకొని వచ్చే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి జిమ్మిక్కుల వలన ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తారని అన్నారు. మత్స్యకారుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని, వైసీపీ నాయకులు ఇప్పటికైనా వాస్తవాలు మత్స్యకారులకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, యువనేత నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలతో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోడీ మద్దతుతో మత్స్యకార రంగానికి ప్రాధాన్యం పెరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మత్స్యకారులకు వలలు, పడవలు, ఇంజన్లు కొనుగోలు కోసం 60 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 80 శాతం వరకు ఆర్థిక సహాయం లభిస్తున్నదని చెప్పారు. ప్రధానమంత్రి మత్స్యకార యోజన కింద రూ.1.20 కోట్ల విలువైన ఆధునిక పడవలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. కావలి నియోజకవర్గంలో ఇటీవల 170 మంది మత్స్యకారులకు మోటార్లపై 40 శాతం సబ్సిడీ ఇచ్చినట్లు వివరించారు. జువ్వలదిన్నెలో 115 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉన్న ఆధునిక ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల భవిష్యత్తును మారుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.158 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. హార్బర్‌లో ఆధునిక జెట్టీలు, లోడింగ్--అన్‌లోడింగ్ సదుపాయాలు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ఫిష్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దీని ద్వారా మత్స్యకారులకు సరైన ధరలు లభించి, దళారులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా హార్బర్ పరిధిలో సాగర్ డిఫెన్స్ సంస్థకు 29 ఎకరాల భూమి కేటాయించడం ద్వారా సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. సముద్రంలో వాతావరణ హెచ్చరికలు, సైక్లోన్ సమాచారం, చేపల నిల్వ ప్రాంతాలపై శాటిలైట్ వివరాలు, తప్పిపోయిన పడవల గుర్తింపు వంటి సేవలు అందించబడతాయని చెప్పారు. దీని ద్వారా మత్స్యకారుల భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడం, వారి ఆదాయాన్ని పెంచడం, సాంకేతికతతో భద్రతను పెంపొందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, బోగోలు మండల టీడీపీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, రేబాల శంకర రెడ్డి, మేడా క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కావలి డీఎస్పీగా రమణ కుమార్, బిట్రగుంట ఎస్సైగా డి రామకృష్ణ బాధ్యతలు స్వీకరణ




**కావలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** కావలి డీఎస్పీగా రమణ కుమార్, బిట్రగుంట ఎస్సైగా డి రామకృష్ణ సోమవారంబాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి డివిజన్ బిట్రగుంట పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, అసాంఘిక కార్యక్రమాలు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్లో ఉన్న అధికారులు డిఎస్పి ని ఘనంగా సన్మానించారు

## ప్రభుత్వ పాఠశాలలో శాతం పెంచాలని ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరి ఎమ్మెల్యే



**కనిగిరి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 13** కందుకూరు నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచాలి. పాఠశాల విద్యకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచాలని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి మండల విద్యాశాఖ అధికారులతో చెప్పారు. జిల్లా పరిశీలకులు , విద్యాశాఖ అధికారులు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే కొనియాడారు. మౌలిక వస్తువులు అవసరమైన చోట ఏర్పాటు చేయిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లో అధికారులు రాజీ పడకూడదని తెలియజేశారు.వేసవి సెలవులలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా వారికి తగిన సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎంఈఓ లను కోరారు. ఎంఈఓ లు నారాయణరెడ్డి, శ్రీనివాసులు ,ప్రసాదు రమణయ్య ,రామిరెడ్డి పాల్గొన్నారు

## గ్రీవెన్స్ డే లో అర్జీలు త్వరగా పరిష్కరించండి కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు విజ్ఞాన్ రిపోర్టర్ ఏప్రిల్ 13** కందుకూరు నియోజకవర్గం లో గ్రీవెన్స్ అర్జీలు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా అధికారులు పనిచేయాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశించారు గుడ్లూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో, సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు మొత్తం 31 శాఖల అధికారులకు గాను.. 8 మంది మాత్రమే హాజరు కావడంపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచి తప్పనిసరిగా గ్రీవెన్స్ కు హాజరు కావాలన్నారు శాఖల వారీగా, గత 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న అర్జీలను నాగేశ్వరరావు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను ప్రత్యేకంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే కారణంగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టిందన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే తెలియజేశారు ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

# జగనన్న పర్యటనను విజయవంతం చేస్తాం : కాకాణి



**నెల్లూరు (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 13** శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు"డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వర్యులు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటనల పట్ల కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది జగన్ మోహన్ రెడ్డి జనాల్లోకి వస్తే ప్రజల నుండి లభిస్తున్న అపూర్వ స్పందన చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోంది జగన్ మోహన్ రెడ్డి ప్రజల వద్దకు రాగానే కూటమి ప్రభుత్వ డొల్లతనం బయటపడుతోంది కూటమి పాలన పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు,అందుకే జగన్ పర్యటనలకు భారీగా జనం తరలివస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి మీద ఉన్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం రకరకాల ఆంక్షలు విధిస్తోంది జగన్ పర్యటనకు కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం పరిపాటిగా మారింది జగన్ మోహన్ రెడ్డి పర్యటనలను అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతులను అవలంబిస్తోంది సెక్షన్ 30 యాక్ట్ అమలు చేసి, అనవసరంగా ఆంక్షలు విధించి, జనాలను జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు రాకుండా,ఇబ్బందులకు గురిచేసేందు ప్రయత్నిస్తుంది పోలీస్ లు ?దారి పొడవునా బారికేడ్లు పెట్టి కార్యకర్తలను ఆపడం, పర్యటనలకు ఆటంకం కలిగించేలా రోడ్లను తవ్వడం, వంటి చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారింది పోలీసుల ద్వారా ఎంతమందిని అడ్డుకున్నా, జగన్ మోహన్ రెడ్డి పై ఉన్న అభిమానాన్ని ఆపలేరు జగన్ వెనుక ఉన్నది కేవలం కార్యకర్తలు మాత్రమే కాదు, ప్రాణాలకు తెగించే 'ఆత్మాహుతి దళం' లాంటి అభిమాన సైన్యం జగన్ మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ పర్యటించినా ప్రజలే స్వచ్ఛందంగా తరలివస్తున్నారు , రాభోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరిస్తూ, గత వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను,కూటమి ప్రభుత్వం అటకెక్కించింది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మత్స్యకారుల చిరకాల కోరికైన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు జగన్ గారి హయాంలోనే జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు 90 శాతం పైగా పూర్తయ్యాయి మత్స్యకారుల సౌకర్యార్థం జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం కోసం ప్రయత్నించాం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా, మిగిలి ఉన్న స్వల్ప పనులను కూడా పూర్తి చేయడంలో వైఫల్యం చెందింది మత్స్యకారుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది తీర ప్రాంతంలోని విలువైన భూములను మరియు హార్బర్ ప్రాంతాలను ప్రైవేట్ సంస్థలకు (సాగర్ డిఫెన్స్ వంటివి) అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు దీనివల్ల స్థానిక మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద ప్రస్తుతం ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని, మత్స్యకారుల పడవల నిలుపుదలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి , ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కంటే మత్స్యకారుల ప్రయోజనాలే మాకు ముఖ్యం సాగర్ డిఫెన్స్‌కు సంబంధించిన కార్యకలాపాల వల్ల మత్స్యకారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హార్బర్‌కు సంబంధించిన సుమారు 79 ఎకరాల స్థలంలో, దాదాపు 29 ఎకరాలు మత్స్యకారులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది మత్స్యకారుల ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌లో నేడు మత్స్యకారులకే చోటు లేకుండా పోతోంది లోకేష్ పేరు మీద వేసిన శిలాఫలకాలను కాపాడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది జువ్వల దిన్నె ప్రాంతంలో సాధారణ ప్రజలెవ్వరినీ రానివ్వకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా జగన్ ని ప్రజల నుంచి వేరు చేయలేరు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి జగన్ మోహన్ రెడ్డి కి మద్దతు తెలపనున్నారు ఈ నెల 15వ తేదీ ఉదయం 9:45 గంటలకు జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుంటారు హార్బర్ ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం, 11:00 గంటలకు .స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో మత్స్యకారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, అండగా నిలబడతారు మధ్యాహ్నం 12:00 గంటలకు జగన్ మోహన్ రెడ్డి తిరిగి ప్రయాణమై వెళ్తారు మత్స్యకారులందరూ జగన్ పర్యటనలో పాల్గొని, తమ సమస్యలు జగన్ మోహన్ రెడ్డి కి తెలియజేయాలని కోరుతున్నా కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా మత్స్యకారుల పక్షాన పోరాటం ఆపేది లేదు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 13** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాలతో టీడీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. 33వ విడతగా వచ్చిన 43 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 43 మంది లబ్ధిదారులకు రూ.14,68,230 మంజూరు కావడం జరిగిందన్నారు. ఇప్పటివరకు మొత్తం 1535 మంది దరఖాస్తు చేసుకోగా 1095 మందికి రూ.8,71,84,210 రావడం జరిగిందన్నారు. మరో 440 మంది లబ్ధిదారుల దరఖాస్తులు ప్రాసెస్ లో ఉన్నాయని, వెరిఫికేషన్ అనంతరం వారికి కూడా త్వరలో చెక్కులు అందజేయబడతాయని తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన నాటకరాని రమణయ్యకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమనిధి కింద రూ.5,00,000 మంజూరు చేయబడిందని తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమనిధికి ఇప్పటివరకు 29 మంది దరఖాస్తు చేసుకోగా 9 మందికి రూ. 45,00,000 జారీ అయ్యాయని,మిగిలిన 20 మంది లబ్ధిదారులకు వారియొక్క నామినీ అకౌంట్ లోకి త్వరలో జమ కాబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఏగూరి చందశేఖర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, అర్షియా బేగం, బోగోలు మండల టీడీపీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, రేబాల శంకర రెడ్డి, మేడా క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు విపిఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుంది

**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**బుచ్చిరెడ్డిపాలెం (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 13** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని దామరమడుగు గ్రామంలో క్రీడా ఉత్సాహం వెల్లివిరిసింది. వి.పి.ఆర్ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ అర్జున్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెల్లూరు పార్లమెంటరీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ క్రీడా ప్రాంగణాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక నాయకులు మరియు క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. క్రీడా ప్రాంగణానికి చేరుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పార్లమెంటరీ స్థాయిలో ఇటువంటి భారీ టోర్నమెంట్ నిర్వహిస్తున్న డాక్టర్ అర్జున్ రెడ్డి యూత్ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు వారిలోని నైపుణ్యానికి పదును పెట్టేందుకు వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని శారీరక దృఢత్వానికి మరియు మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయన్నారు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి యువత క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో యువత మరియు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.